క్లుప్తంగా

## విలువిద్యలో విద్యార్థుల ప్రతిభ

**సీతానగరం:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర ఆర్చరీలో అండర్ 14, అండర్ 17, అండర్ 19 కేటగిరీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎం ప్రసన్నలక్ష్మీ అభినందించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆకుల కామర్ద్, పి.రంజిత్, ఎనిమిదో తరగతి చదువుతన్న బొంగు భానుప్రసాద్, సింగరోతు గౌరీశంకర్ అర్హత సాధించడం అభినందనీయమని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సత్కరించారు.

## బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ

**మక్కువ:** బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాలల సంక్షేమ సంరక్షణ కార్యక్రమంపై ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అర్జునరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన, పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణ, సీడీపీవో బి.అనంతలక్ష్మి, రిసోర్స్‌పర్సన్ పి.శ్రీధర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన పార్వతి

**మెంటాడ:** సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న జి.పార్వతి గురువారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పని చేస్తున్న పీఎస్ఎన్ఐ పట్నాయక్ పదవీ విరమణ పొందారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆటో డ్రైవర్లు

**మక్కువ:** ఆటో డ్రైవర్ల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే పోరాటం తప్పదని సీఐటీయూ, ఆటోడ్రైవర్ల కార్మిక జేఏసీ హెచ్చరించింది. స్థానిక తహసీల్దార్ భరత్‌కుమార్‌కు తమ సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక జేఏసీ మండల నాయుకుడు మామిడి నరేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో, ఆటో రంగం కుదేలైందన్నారు. ఆటో రంగంపై ఆధారపడ్డ కుటంబాలు రోడ్డున పడే అవకాశముందన్నారు. వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లుకు 3వేల రూపాయిలు అందివ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు, ఆటో కార్మిక జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మరణాలకు చెక్ పెట్టండి

- జేసీకి కాంగ్రెస్ వినతి

**పార్వతీపురం రూరల్:** కొన ఊపిరితో ఉన్న ఐటీడీఏకు ఆయుష్షు పోయాలని, విద్యార్థుల మరణాలు లేకుండా, గిరిజన అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. పీడీవీకేలను గాడిలో పెట్టి, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మౌలిక వసతులు కల్పిస్తూ మెనూ సక్రమంగా అమలు చేయాలని కోరారు. జిల్లాలో కబ్జాలకు గురైన చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని విన్నవించారు. పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, కోల కిరణ్‌కుమార్, గౌరీశంకరరావు, రామకృష్ణ తదితరులున్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌తో కుల ధ్రువీకరణ పత్రం

**వీరఘట్టం:** వాట్సాప్ గవర్నెన్స్‌తో కుల ధ్రువీకరణ పత్రం సులువుగా పొందవచ్చునని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు సూచించారు. మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతీ వ్యక్తి తనకు కావాల్సిన కుల ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండి అందులో నెట్ బ్యాలెన్స్ ఉంటే సులువుగా కుల ధ్రువీకరణ పత్రం పొందవచ్చునన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు.

# విద్యార్థులే వంట మనుషులు..!

పార్వతీపురం రూరల్:

మండలంలోని డోకిశీల కేంద్రంలో ఉన్న బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల అవస్థలు చెప్పనలవి కానివిగా ఉన్నాయి. ఈ పాఠశాలలో మూడు నెలల్లో ముగ్గురు వార్డెన్లు మారారంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వార్డెన్లు మారినా.. విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇక్కడ ప్రతి రోజూ దిన దిన గండంగానే గడుస్తోంది. సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం, విద్యార్థులే వంట వారుగా అవతారమెత్తడం, సరిపడా భోజనాలు పెట్టకపోవడం, మౌలిక సదుపాయాల లోటు, వాడుకకు పనికి రాని మరుగుదొడ్లు, తలుపులు, కిటికీల్లేని విద్యార్థులు నిద్రించే గదులు.. ఇలా దేనికదే సమస్యగా ఉంది. ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు... రాత్రి కూడా వీరికి కష్టాలు వెన్నాడుతున్నాయి. అయినా ఇటు పాలకులుగాని, అటు అధికారులుగాని పట్టించుకోవడం లేదు. ఐటీడీఏ అధికారులు చొరవ తీసుకుని పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదు. తామంటే పాలకులకు, అధికారులకు ఇంత చులకన భావమెందుకో అర్థం కావడం లేదని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యానికి కారణమెవరు? అంటూ విద్యార్థులు వాపోతున్నారు. చదువుకోవాల్సిన ఆశ్రమ పాఠశాలలో ఇలా విద్యార్థులు సమస్యలతో సతమతమవుతుంటే పాలకులు గుడ్లప్పగించి చూడడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భోజన శాల వద్ద వంట పనులు చేస్తూ.. కూరగాయలు కోస్తున్న విద్యార్థులు



జేసీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

### జాయింట్ కలెక్టర్‌కు వినతి

డోకిశీల ఆశ్రమ పాఠశాలలో ఇటీవల కాలంలో ముగ్గురు వార్డెన్లు మారినా ఎటువంటి మార్పు లేదని అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డికి ఆశ్రమ పాఠశాల సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలు చేయకుండా, విద్యార్థులతో వంట పనులు చేయించడం సరికాదని పేర్కొన్నారు. గిరిజన ప్రభుత్వ విద్యా సంస్థల్లో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న పాలకులు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

## 'కూటమి' తీరుపై మున్సిపల్ కార్మికుల నిరసన




ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ధ్వజమెత్తారు. యూనియన్ రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు గురువారం మున్సిపల్ కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని, జీతాలు పెంచాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, చనిపోయిన కార్మికులకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. సంఘ నాయకులు శంకరరావు, రవి, రాములు, స్వప్న తదితరులు పాల్గొన్నారు. – సాలూరు

# రహదారి కోసం ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

**సాలూరు:** పాచిపెంట మండలంలోని కొటికిపెంట, కేసలి గ్రామాల రైతుల పంట పొలాలకు రహదారి కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక పోలేటి చెరువు సమీపంలో హైవే వద్ద రైతు సంఘం, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సలాది అప్పలనాయుడు, నర్సింగరావు తదితరుల ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ నేషనల్ హైవే అధికారులు చిన్న చిన్న నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా సైడ్ వాల్ల నిర్మాణం చేపట్టి రైతులను పంట పొలాలకు వెళ్లనీయకుండా రహదారి లేకుండా చేయడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా పంట పొలాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేసిన సైడ్ వాల్స్‌ను తొలగించి సర్వీస్ రోడ్డు వేయాలని కోరారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుల ప్రతినిధులు, నాయకులు, రైతులు ఇజ్జాడ శ్రీనివాసరావు, సలాది నరసింహులు, కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బలిజిపేట:** బలిజిపేట పట్టణం, రూరల్ ఫీడరు, పెదపెంకి ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏఈ సింహాచలం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**పార్వతీపురంలో...**

**పార్వతీపురం రూరల్:** మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్, వెంకంపేట 11కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరా జరుగుతున్న నర్సిపురం, వైకేఎం పంచాయతీ భాగం అఫీషియల్ కాలనీ, 40 అడుగుల రోడ్డు గల ప్రాంతం, వసుంధర నగర్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామీణ ప్రాంత విద్యుత్ శాఖ ఏఈ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

**సీతానగరంలో..**

**సీతానగరం:** విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ పి.విశ్వేశ్వరరావు తెలిపారు. దీని కారణంగా సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, కొత్తవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. బూర్జ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బూర్జ, కృష్ణారాయపురం, పెదంకలాం, చినంకలాం, సుమిత్రాపురం, కామందొరవలస ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**పార్వతీపురం టౌన్:** పార్వతీపురం ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పలు సబ్‌స్టేషన్ల ఆర్డీఎస్ఎస్ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ గోపాలరావు నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వాటర్ వర్క్స్ ఫీడర్, 11 కేవీ అడ్డాపుశీల ఫీడర్, 11 కేవీ చంద్రంపేట ఫీడర్‌పైన ఉన్నటువంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

## ఆరోగ్యశ్రీ సేవలపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

**పార్వతీపురం టౌన్:** ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదలపై అసెంబ్లీలో ప్రస్తావించి తక్షణ చర్యలు తీసుకొని ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. పేదల అనారోగ్యానికి ఆదుకొనే ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఇటీవల ఆరోగ్య శ్రీ సేవలు పలు ప్రైవేట్ ఆసుపత్రిలో నిలుపుదల చేయడంతో రోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు భారీగా పెరిగిపోవడంతో, ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ రోగులను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు దుర్గారావు ఉన్నారు.

## వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు

**సీతానగరం:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం రోగులకు వరమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ పి.ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ పథకం ద్వారా 339 ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్నామని, ప్రతీ శిబిరంలో ఏర్పాటు చేసిన 14 కౌంటర్ల ద్వారా ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ తెర్లి జగన్‌మోహన్‌రావు, ఎపిడిమాలజిస్ట్ డా.కౌషిక్, ఆయుష్ వైద్యాధికారి డా.హేమాక్షి, ప్రత్యేక వైద్యులు డా.కుషల, రత్న, శ్యామల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతల్లో హిమోగ్లోబిన్ శాతం పెరగాలి

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి విజయ్‌మోహన్

**బలిజిపేట:** గర్భిణులు, బాలింతలు హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకోవాలని, దీనిపై సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి విజయ్‌మోహన్ తెలిపారు. బలిజిపేట పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మహిళలకు, గర్భిణులు, బాలింతలకు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు ఇతరత్రా ఎటువంటి వ్యాధి సంబంధమైన వాటికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరంలో 123మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాధురి, వివిధ విభాగాల వైద్యాధికారులు నీహారిక, స్నిగ్ధ, రమ్య, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, జ్యోతిష్, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

## మహిళల ఆరోగ్యమే లక్ష్యం

**పార్వతీపురం రూరల్:** మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే కేంద్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిత్యం సంసార బాధ్యతలతో ఒత్తిడితో కూడిన పనులతో వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోలేని మహిళలు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. పార్వతీపురం మండలంలో పెదబొండపల్లి, పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కృష్ణపల్లి సబ్‌సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ మేరకు వైద్యాధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆమెతో పాటు వైద్యురాలు ధరణి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.



కృష్ణపల్లి సబ్‌సెంటర్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



పార్వతీపురం పట్టణంలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

**పార్వతీపురం టౌన్:** మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంఘం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పార్వతీపురం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ పకీరునాయుడుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.సింహాచలం, ఎన్.శంకరరావు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తుందన్నారు. గత ప్రతిపక్షంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు పూర్తిగా దానిని విస్మరించాలని పేర్కొన్నారు. 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు చెల్లించాలని, గత జులై సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, ఫెడరేషన్ నాయకులు మామిడి శివ, బంగారు రాజేష్, బంగారు రవి, పి.సంతోష్, మామిడి శ్రీను, ఎన్.శివ, పాపమ్మ, ఇప్పలమ్మ, మరియు మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, క్లాప్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# వాహనమిత్ర అందరికీ అమలు చేయాలి



పట్టణంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న యూనియన్ నాయకులు, ఆటో వాలాలు

**సాలూరు:** డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహనమిత్ర అమలు చేయాలని సాలూరు, పాచిపెంట ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, ఆటోవాలాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సాలూరు తహసీల్దార్ కార్యాలయం, పాచిపెంట మండల కేంద్రం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు .ఈ సందర్భంగా నాయకులు ఎన్వైనాయుడు, కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ, ఉచిత బస్సు వలన ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లు అందరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.30వేలు అందివ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆటోడ్రైవర్ల సమస్యలపై చర్చించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డ్రైవర్లు అందరికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. ఆటో డ్రైవర్లుకు భద్రత కల్పించాలని, పెంచిన గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. పట్టణంలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు.కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, ఆటో వాలాలు పాల్గొన్నారు.

# అందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ




ర్యాలీలో పాల్గొన్న పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు, తదితరులు

**పార్వతీపురం టౌన్:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పార్వతీపురం మన్యం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.బాబూరావు అన్నారు. గురువారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో పాత బస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు పోస్టల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా పర్యావరణాన్ని రక్షించుకుంటే భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన మంచి వాతావరణాన్ని అందించగలిగే వారమవుతామన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ప్రతి ఒక్కరి ఇంటి ముందు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు.

# స్వచ్ఛత హి సేవ మానవహారం



పట్టణంలో నిర్వహించిన మానవహారం

**సాలూరు:** పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హి సేవ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించండి

**కొమరాడ:** కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆదికర్మ యోగి అభియాన్‌లో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో ఎస్.రమేష్ సూచించారు. మండలంలోని దేవుడుకోన గ్రామంలో గ్రామసభ గురువారం నిర్వహించారు. గ్రామంలో ఏయే మౌలిక వసతులు కల్పించాలన్న విషయాలను మండల అధికారుల బృందం గుర్తించి, వాటి వివరాలు గ్రామసభలో చదివి వినిపించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం:** గ్రామాల సుస్థిరాభివృద్ధే ఆదికర్మ యోగి అభియాన్ లక్ష్యమని ఆ ప్రాజెక్టు అసోసియేట్ దివ్యానందన్ అన్నారు. మండలంలోని రెల్ల, అడ్డంగూడ గ్రామాల్లో ఆదికర్మ యోగి అభియాన్ గ్రామసభలు గురువారం నిర్వహించారు. గ్రామాల్లో ఏయే మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి, కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. ప్రతి గ్రామం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నదే ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ దిశగా అధికారులు కృషి చేయాల్సి ఉంటుందన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తి చేయండి

**కురుపాం:** మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్మాణ దశలోని కళాశాలను ఆయన గురువారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చిందని, ఈ దశలో నిర్మాణం పూర్తిపై దృష్టి సారిస్తే ఇక్కడి గిరిజనులకు ఇంజినీరింగ్ విద్యను దగ్గర చేసిన వారవుతారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకుని, ప్రభుత్వంతో నిర్మాణం పూర్తి చేయించే బాధ్యతను తీసుకోవాలన్నారు.